
సాక్షి
అనంతపురం
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



టమాట కిలో రూ.6
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.6, కనిష్టంగా రూ.3, సరాసరి రూ.4.50 పలికింది.



చీనీ టన్ను రూ.38 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/21.2°
జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. అయినా మధ్యాహ్నం వరకు తీవ్ర ఉక్కపోత నెలకొంది. గాలివేగం స్వల్పంగా పెరిగింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



అనంతపురంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సాయిరామ్

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 5వ తరగతి ప్రవేశ కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,774 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 7,650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. మొత్తం 42 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్‌రామ్, జిల్లా మత్స్యశాఖ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ కృష్ణనాయక్ తదితరులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారని వెల్లడించారు.

రేపటి నుంచి టీటీసీ శిక్షణ తరగతులు

రాప్తాడురూరల్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) శిక్షణ తరగతులు మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత ట్రేడ్‌లో లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్‌తో పాటు సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత ఉండాలని సూచించారు. ఎస్ఎస్‌సీ/ఎస్ఎస్‌సీ ఒకేషనల్ ఉత్తీర్ణత సర్టిఫికెట్ ఉండాలని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు జారీ చేసిన ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణత సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని డీఈఓ సాయిరామ్ సూచించారు.

వేగవంతంగా కనెక్షన్లు

ఉమ్మడి అనంతపురం జిల్లా అంటేనే బోర్ల ఆధారిత వ్యవసాయం. బోర్లు ఉన్నా దానికి తగ్గట్టుగా కరెంటు ఉంటేనే రైతులకు నాలుగు రూపాయలు వచ్చేది. కానీ ఒకప్పుడు జిల్లాలో వ్యవసాయ కనెక్షన్ కావాలంటే విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కనీసం ఏడాదిన్నర దాటినా వచ్చేది కాదు. దీంతో రైతులు పంటలు చేతికందక అప్పులపాలయ్యే వారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. కరెంటుకు ఢోకా లేదు. ఖర్చుకు వెనకాడకుండా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

- అన్నదాతకు అండగా..
- గతంలో మాదిరిగా ఎదురుచూపుల్లేవు
- దరఖాస్తు చేసిన పది రోజుల్లోనే మంజూరు
- ఒక్క ఏడాదిలోనే 20వేల వ్యవసాయ కనెక్షన్లు
- వీటి కోసం 5 వేల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్
- జగన్ సర్కార్ చర్యలపై రైతుల్లో హర్షాతిరేకం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రికార్డు స్థాయిలో మంజూరు చేశారు. వాల్టా చట్టం కింద మార్పులు రావడం, భూగర్భ జలాలు ఎక్కువగా ఉండటంతో బోర్లు వేసుకునేందుకు నిషేధిత జాబితా నుంచి మండలాలకు ఊరట లభించడంతో వేలాది మంది రైతులు బోర్లు వేయించారు. బోర్లు వేసుకుని వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లోనే అధికారులు మంజూరు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 20 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేశారు.

5 వేల ట్రాన్స్‌ఫార్మర్లు

ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోలు చేయాలంటే ప్రభుత్వానికి రూ.3 లక్షల వ్యయం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఒక్క ఏడాదిలోనే శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం 5వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే రెండేళ్లు కూడా పట్టేది. దీంతోపాటు లో వోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోయి పంటలు ఎండిపోయేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితి మచ్చుకు కూడా కనిపించలేదు. ఎవరైనా రైతు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లోనే ఇస్తున్నారు. గతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు వెయిటింగ్ సమయం కనీసం 8 నెలలు ఉండేది. ఇప్పుడా కాలాన్ని 15 రోజులకు తగ్గించారు. మరో వైపు 20 కొత్త సబ్‌స్టేషన్‌లు రెడీ అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 3 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు ఉండగా.. వీటి సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తోంది. ఎక్కడా కోత లేకుండా కరెంటు సరఫరా చేస్తూ అన్నదాతకు అండగా జగన్ సర్కారు నిలుస్తోంది.

అనంతపురం జిల్లాలో నియోజకవర్గాల వారీగా వ్యవసాయ కనెక్షన్లు	
నియోజకవర్గం	కనెక్షన్లు
అనంతపురం అర్బన్	229
రాయదుర్గం	30,147
శింగనమల	51,247
తాడిపత్రి	16,201
ఉరవకొండ	24,871
గుంతకల్లు	13,255
కళ్యాణదుర్గం	31,457

శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు	
నియోజకవర్గం	కనెక్షన్లు
ధర్మవరం	23,145
హిందూపురం	8,067
కదిరి	17,879
మడకశిర	18,548
పెనుకొండ	17,884
పుట్టపర్తి	24,150
రాప్తాడు	34,125

ఇంత త్వరగా వస్తాదనుకోలేదు



గత ఏడాది కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో నేను పొలంలో బోరు వేయించాను. ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో కొత్తగా మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాను. 25 రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ వచ్చింది. ఇది నిజంగా నమ్మలేకపోయాను. గత టీడీపీ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం నెలల తరబడి తిరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.
– జి. చంద్రమోహన్‌రెడ్డి, కదిరిదేవరపల్లి,కంబదూరు మండలం

30 రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ వచ్చింది



నేను ఏఈ సార్ దగ్గర కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలని అడిగాను. దరఖాస్తు చేసుకోమన్నారు. నా పొలం వివరాలతో దరఖాస్తు చేసుకున్నాను. డీడీ కట్టిన 30 రోజుల్లోనే నాకు ట్రాన్స్‌ఫార్మర్ వచ్చింది. కరెంటు ఆఫీసు వాళ్లే పొలం వద్దకు వచ్చి బిగించారు. ఇలా ఇంత త్వరగా డీపీ వస్తాదని అనుకోలేదు.
– వెంకటేశులు, యనకల్లు, బ్రహ్మసముద్రం మండలం

రికార్డు స్థాయిలో వ్యవసాయ కనెక్షన్లు



గత ఏడాది అంటే 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎప్పుడూ లేనంతగా 20 వేల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం. రైతుల కోసం 5వేల ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడా లోవోల్టేజీ సమస్య లేదు. కోతలు లేని నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తున్నాం.
–సురేంద్ర, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్

జగన్ వెంటే జనం

- సీఎంను విమర్శించే స్థాయి కాలవకు లేదు



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: రాష్ట్రంలో అభివృద్ధి – సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న జగన్ వెంటే జనం ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మేనిఫెస్టోలోని హామీలు పూర్తిగా అమలు చేసి ప్రజల్లో అపారమైన విశ్వాసం, నమ్మకం చూరగొన్నారని, సంక్షేమ పాలనతో దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. శనివారం రాయదుర్గంలోని తన కార్యాలయంలో ప్రభుత్వ విప్ మీడియాతో మాట్లాడారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా జనం నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోనూ 1,03,821 కుటుంబాలకుగాను 89,276 కుటుంబాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నేరుగా కలిసి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరించామన్నారు. 90 శాతం మంది ప్రజలు జగన్ పాలనను మెచ్చుకుని జై కొట్టారన్నారు. మరో 30 ఏళ్లపాటు జగనే సీఎంగా ఉండాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. జగన్‌కు వస్తున్న ప్రజామద్దతును చూసి ప్రతిపక్ష నేత చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరివని అన్నారు.

కాలవ సెల్ఫీ డ్రామాలకు కౌంటర్

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆడుతున్న సెల్ఫీ డ్రామాలకు దీటుగా కౌంటర్ ఇవ్వనున్నట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. తొలి సెల్ఫీకే అభాసుపాలైన కాలవకు రెండో సెల్ఫీకి కూడా ఆధారాలతో సహా బుద్ధి చెబుతామన్నారు. ఎస్ హనుమాపురంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రమ్మంటే కాలవ రచ్చ చేసి తప్పించుకున్నాడని ధ్వజమెత్తారు. గ్రామానికి ఈ నాలుగేళ్లలో తాము రూ.9.25 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. టీడీపీ హయాంలో ఈ గ్రామాన్ని అడ్డుపెట్టుకుని రూ. వందల కోట్ల ఇసుక దోపిడీ చేయలేదా అని కాలవను నిలదీశారు. ఈసారి నియోజకవర్గంలో ఒకటో నంబర్ పోలింగ్ బూత్ ఉన్న మలపనగుడి గ్రామంలో ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి, లబ్ధి జరిగిందో సామరస్యంగా చర్చించేందుకు రావాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి కాలవకు లేదని ధ్వజమెత్తారు.

అకాల వర్షం.. అపార నష్టం



సోమలదొడ్డిలో బాధిత రైతుతో మాట్లాడుతున్న అనంతపురం ఏడీ పి.వెంకటేశ్వరప్రసాద్



కల్లూరులో రైతు హుస్సేన్‌తో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

- పెద్దవడుగూరులో కుండపోత
- 25 మండలాల్లో 18.7 మి.మీ నగటు వర్షపాతం నమోదు
- వ్యవసాయ, ఉద్యాన రైతులకు రూ.1.85 కోట్ల నష్టం

అనంతపురం అగ్రికల్చర్: అకాల వర్షం అపార నష్టం మిగిల్చింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జిల్లాలోని 25 మండలాల్లో 18.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు మండలంలో కుండపోత వర్షం కురిసింది. 25 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, భారీ ఉరుములు, మెరుపులతో వరుణుడు ప్రతాపం చూపించాడు. అత్యధికంగా పెద్దవడుగూరులో 105.6 మి.మీ నమోదు కాగా... పామిడి, గార్లదిన్నెలో 74 మి.మీ, కళ్యాణదుర్గం 37.2, అనంతపురం 34.2, బెళుగుప్ప 24.6, గుత్తి 24.4, కూడేరు 21.4, యాడికి 19.4, శింగనమల 19, పెద్దపప్పూరు, రాప్తాడు 18.6, కణేకల్లు 14.8, పుట్లూరు 14.2, బుక్కరాయసముద్రం 14, తాడిపత్రి 12.4, గుమ్మఘట్ట 11.6 మి.మీతో పాటు విడపనకల్లు, ఉరవకొండ, గుంతకల్లు, వజ్రకరూరు, కంబదూరు, ఆత్మకూరు, కుందుర్పి, నార్పల తదితర మండలాల్లో వర్షపాతం నమోదైంది. ఏప్రిల్ నెల సాధారణ వర్షపాతం 12.1 మి.మీ కాగా 24.6 మి.మీ నమోదైంది. గత జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 475.7 మి.మీ గాను 44 శాతం అధికంగా 686 మి.మీ వర్షపాతం నమోదైంది.

రూ.1.85 కోట్ల పంటనష్టం

వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, గార్లదిన్నె, శింగనమల, రాప్తాడు తదితర మండలాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. చీనీ, నిమ్మ, మామిడి, అరటి, బొప్పాయి, ఆకు, అరటి పంటలు 59 హెక్టార్లలో దెబ్బతినడంతో రూ.50 లక్షల వరకు పంటనష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లో వరి, మొక్కజొన్న, కొర్ర తదితర పంటలు 228 హెక్టార్లలో దెబ్బతినడంతో రూ.1.35 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

మరో రెండు రోజులు వర్ష సూచన

రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ శనివారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. అమరావతి వాతావరణ కేంద్రం అందించిన సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతంలో దిగువ ట్రోపో ఆవరణలో ఆగ్నేయ, నైరుతి గాలులు వీస్తున్నందున మోస్తరు నుంచి తేలికపాటి వర్షం పడే సూచన ఉందన్నారు. అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదయ్యే సూచన ఉన్నట్లు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



జేఈఈ మెయిన్స్ ర్యాంకర్లు : ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, నిఖిల్ అగ్నిహోత్రి, బొజ్జ ప్రశాంత్, అభిరామ్, హర్షానుఖానమ్, మోనియాబేగం, సునీల్‌కుమార్

రాప్తాడు రూరల్/తాడిపత్రి టౌన్: దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన జేఈఈ (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్) మెయిన్స్–2023 సెషన్–2 ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. జేఈఈ మెయిన్స్ సెషన్–1 జనవరిలో జరిగిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 6 నుంచి 15 వరకు సెషన్–2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ స్కోరు (రెండుసార్లు రాసిఉంటే)ను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ప్రకటించారు. సీఆర్ఎల్ (కామన్ ర్యాంక్ లిస్ట్) ర్యాంకులతో పాటు కేటగిరీ ర్యాంకులను ప్రకటించారు. ఆయా కేటగిరీల్లో కటాఫ్ కంటే ఎక్కువగా ఉన్నవారందరూ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత సాధించారు. జూన్ 4న జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తాడిపత్రికి చెందిన పొన్నతోట ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఆలిండియా స్థాయిలో 97వ ర్యాంకు, అనంతపురానికి చెందిన బి.నిఖిల్ అగ్నిహోత్రి ఓపెన్ కేటగిరీలో 650వ ర్యాంకు, దూదేకుల మోనియా బేగం 747 ర్యాంకు, సునీల్‌కుమార్ 780వ ర్యాంకు సాధించారు. బొజ్జ ప్రశాంత్ పీడబ్ల్యూడీ కేటగిరీలో 271వ ర్యాంకు, అలాగే రేవంత్‌రెడ్డి 1847వ ర్యాంకు, ఈ.అభిరామ్ ఎస్టీ కేటగిరీలో 2004వ ర్యాంకు, జ్యోతిప్రశాంత్‌నాయక్ 2,070వ ర్యాంకు, ఎం.ప్రజ్ఞశ్రీ జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 2,017వ ర్యాంకు, వెంకటభవదీప్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 2,752వ ర్యాంకు, తాడిపత్రికి చెందిన సి.మనోజ్ 3,167వ ర్యాంకు, ఎ.విశ్వేశ్వరరెడ్డి జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 4,568వ ర్యాంకు సాధించారు. వివిధ కేటగిరీల్లో షేక్ జహ్వారా 3,242, బస్సీప్రీతమ్ ఎస్సీ కేటగిరీలో 3,945, డి.వెంకటపవన్ ఎస్టీ కేటగిరీలో 4,347, సాకే గౌతమ్‌సాయి 6,808, ఎస్సీ కేటగిరీలో చిన్న నాగన్న 7,067, షేక్ ఖాజీ రిజా ముఖద్దామ్ 9,237వ ర్యాంకులు సాధించారు.



ప్రజ్ఞశ్రీ షేక్ జహ్వారా చరణ్

- అలాగే పెనుకొండకు చెందిన పటాన్ హర్షానుఖానమ్ ఓబీసీ కేటగిరీలో 557వ ర్యాంకు, బి.చరణ్ 2,692వ ర్యాంకు సాధించారు.

వైద్య సేవలపై 'ముస్కాన్' సంతృప్తి

- సీఎస్ఆర్ నిధులతో వైద్య సేవలు మరింత మెరుగు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై 'ముస్కాన్' వైద్య బృందం సభ్యులు డాక్టర్ అమిత్ మల్కర్, డాక్టర్ మనోజ్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. వీరు రెండో రోజు శనివారం సర్వజనాస్పత్రిలోని పీడియాట్రిక్ వార్డులో రికార్డులు తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించి పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేసి ఉండటాన్ని మెచ్చుకున్నారు. సర్వజనాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో వసతులు సమకూర్చుకోవాలన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సీఎస్ఆర్ ద్వారా పెద్ద సంఖ్యలో ఆసుపత్రులకు వసతులు సమకూరుతున్నాయన్నారు. అనంతపురం ఆస్పత్రిలోనూ మరింత మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇక్కడి సిబ్బంది, వైద్యులు, వైద్య బృందం అందిస్తున్న తోడ్పాటు చాలా బాగుందన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సుహాసిని, వైద్యులు ప్రవీణ్ దీన్‌కుమార్, డాక్టర్ శంకర్, పీజీ వైద్య విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాల దిశగా అడుగులు

- 13,385 ఇళ్ల నిర్మాణాలకు చర్యలు
- ఇప్పటికే 11 వేల నిర్మాణాలు పూర్తి
- మే మూడో వారంలో సుముహూర్తం



రాప్తాడు లేఅవుట్‌లో నిర్మించిన జగనన్న ఇళ్లు

అనంతపురం టౌన్: పేదల సొంతింటి కల సాకరం దిశగా జగనన్న ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద జిల్లాలో వేలాదిమంది నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటు పక్కాగృహాలు మంజూరు చేసింది. లేఅవుట్లు వేసి ఊళ్లకు ఊళ్లనే నిర్మిస్తోంది. మొదటి విడతలో 13,385 ఇళ్లను పూర్తి చేసి మే మూడో వారంలో లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేపట్టాలని సుముహూర్తం నిర్ణయించింది. ఇందుకోసం గృహ నిర్మాణ సంస్థ అధికార యంత్రాంగం ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేదిశగా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే 11వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు మే 12వ తేదీలోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో 2,500 ఇళ్లు

రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా 2,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలు చేయించనున్నారు. రాప్తాడు మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో 70 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వీటితోపాటు ఉప్పరపల్లి లేఅవుట్‌లో సైతం సామూహిక గృహ ప్రవేశాలకు ఇళ్లు సిద్ధమవుతున్నాయి. ఆలమూరు లేఅవుట్‌లో 2వేల ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని లక్ష్యం విధించుకున్న అధికారులు ఇప్పటికే 750కి పైగా ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఆప్షన్–3 కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణ పనులు సైతం వేగవంతంగా చేపడుతున్నారు. సామూహిక గృహ ప్రవేశాలకు ఆప్షన్–3 కింద చేపట్టిన ఇళ్లను 300 మంది లబ్ధిదారులకు అందజేయనున్నారు.

పండుగలా గృహ ప్రవేశాలు

మే మూడో వారంలో పండుగ వాతావరణంలో సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టనున్నాం. జిల్లా వ్యాప్తంగా 13,385 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తున్నాం. రాయదుర్గం నియోజకవర్గంలో 1200 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటితోపాటు జగనన్న లేఅవుట్లలో ఆలమూరు, గుంతకల్లు, ఉప్పరపల్లి, రాప్తాడు లేఅవుట్లలో నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

– కేశవనాయుడు, పీడీ, గృహనిర్మాణ సంస్థ

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



బాలు(ఫైల్)

గుత్తి రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువరైతు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తురకపల్లికి చెందిన చాకలి బాలు (30), లక్ష్మీదేవి దంపతులు తమకున్న నాలుగు ఎకరాల పొలంలో వ్యవసాయ పనులతో పాటు పాడి పశువులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పశువుల పాక సమీపంలో విద్యుత్ తీగ తెగిపడింది. శనివారం ఉదయం 6 గంటలకు పశువులను పాకలో కట్టేందుకు సిద్ధమైన బాలు.. తెగిపడిన విద్యుత్ తీగను గమనించి పక్కకు తొలగించేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో విద్యుత్ ప్రసారం జరగడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కుప్పకూలాడు. పశువుల పాకలోకి వెళ్లిన భర్త ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మీదేవి వెళ్లి చూసింది. అపస్మారకంగా పడి ఉన్న భర్తను చూసి గట్టిగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసింది. స్థానికులు వెంటనే బాలుని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి శనివారం హౌసింగ్ డే

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో హౌసింగ్ డే నిర్వహించి లబ్ధిదారుల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరిస్తామని హౌసింగ్ పీడీ కేశవనాయుడు తెలిపారు. శనివారం ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ అమృతరాజుతో కలసి కూడేరు కేజీబీవీ సమీపంలోని జగనన్న లేవుట్‌తో పాటు ఉరవకొండ కొలిమి లేఅవుట్, రాయంపల్లి లేవుట్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉరవకొండ, కూడేరు ఎంపీపీలు చంద్రమ్మ, నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ చంద్రమౌళి, హౌసింగ్ డీఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యం కోసం వచ్చి మృత్యుఒడికి..

కళ్యాణదుర్గం: వైద్యం కోసం వచ్చిన ఓ మహిళ.. ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లికి చెందిన ఎరికల గంగమ్మ (57), ఎర్రిస్వామి దంపతులు. వీరికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న గంగమ్మ.. శనివారం సాయంత్రం చికిత్స చేయించుకునేందుకు కళ్యాణదుర్గానికి వచ్చింది. అనంతరం వైద్యుడు రాసిచ్చిన మందులు కొనుగోలు చేసేందుకు టీ సర్కిల్ సమీపంలోని మెడికల్ స్టోర్ వద్దకు చేరుకోగానే కుప్పకూలిపోయింది. స్థానికులు వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఔట్ పోస్టు పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న మృతురాలి కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పశుసంవర్ధకశాఖకు రాష్ట్రస్థాయి అవార్డు

- డివిజన్ల విభాగంలో ఉరవకొండకు దక్కిన పురస్కారం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసిన జిల్లా పశుసంవర్ధకశాఖకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం 'సాక్షి'కి తెలిపారు. శనివారం విజయవాడ వేదికగా పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ నుంచి ప్రశంసాపత్రం, జ్ఞాపికను ఆయన అందుకున్నారు. పశుశాఖ పథకాల అమలులో మొదటి స్థానంలో శ్రీకాకుళం, రెండో స్థానంలో బాపట్ల ఉండగా మూడో స్థానంలో అనంతపురం జిల్లా నిలిచింది. అలాగే డివిజన్ల విషయానికి వస్తే మొదటి స్థానంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఉండగా రెండో స్థానంలో ఉరవకొండ డివిజన్‌కు అవార్డు దక్కింది. డివిజన్లకు సంబంధించిన అవార్డును ఉరవకొండ డీడీ డాక్టర్ కె.వెంకటేష్ అందుకున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ప్రభుత్వం నిర్దేశించిన పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల సాఫ్ట్‌బాల్ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలను అనంత క్రీడా గ్రామంలోని విన్సెంట్ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించారు. పిచ్చింగ్, క్యాచింగ్, బ్యాటింగ్ విభాగాల్లో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలుర జట్టులో శశి, అరవింద్, అరవింద్‌రెడ్డి, జగదీష్, సాయి, రంజిత్, ముబారక్, అక్షయ్, నరసింహ, గణేష్, అంజి, సునీల్, సాయికుమార్, బస్వంత్, మనోహర్, భాను, శంకర్, సాయికుమార్, మోక్షిత్‌వర్మ, సాదిక్ ఉన్నారు. అలాగే బాలికల జట్టులో రాజేశ్వరి, అనూష, శిరీష, అమిదాబి, గౌరీప్రియ, ఉషారాణి, కీర్తన, మౌనిక, కల్పన, లోహిర, అనూష, హేమలత, ఫాతిమా, షబీనా, మౌనిక చోటు దక్కించుకున్నారు. ఎంపికలను రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు , ఆర్డీటీ గ్రాస్ రూట్ లెవల్ కో–ఆర్డినేటర్ ఓబులేసు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు కేశవమూర్తి, గోపాలరెడ్డి, ఫక్కీరప్ప, ప్రభాకర్, లతాదేవి, హిమబిందు, రామాంజినమ్మ, గంగ, కోచ్‌లు పర్యవేక్షించారు.

అర్హత గల ప్రతి ఒక్కరికీ పింఛన్

అనంతపురం: అర్హత గల ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి ఆదేశించారు. శనివారం నిర్వహించిన జిల్లా సమాఖ్య షెడ్యూల్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానమైన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా సమాఖ్య హెల్త్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. వారానికి ఒక సారి చిరుధాన్యాలు వినియోగించేలా సభ్యులను చైతన్య పరచాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ బి.ఈశ్వరయ్య, జీవనోపాధుల ప్రాజెక్ట్ మేనేజర్ రాధారాణి, డీపీఎం ఫైనాన్స్ ఎం.సత్యనారాయణ, ఉన్నతి ఏపీఎం సుభద్రమ్మ, స్త్రీనిధి ఏజీఎం హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎంశ్రీ' పాఠశాలలకు విరివిగా నిధులు : డీఈఓ

రాప్తాడు రూరల్: ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) కార్యక్రమానికి ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విరివిగా నిధులు మంజూరవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. పీఎంశ్రీ కార్యక్రమానికి ఎంపికైన స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో శనివారం అనంతపురంలోని సైన్స్‌సెంటర్‌లో ఆయన సమావేశమై మాట్లాడారు. జిల్లాలో పీఎంశ్రీ కార్యక్రమానికి ఎంపికైన 38 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు, చాప్టరైజేషన్‌ను నిబంధనల మేరకు సిద్ధం చేసి ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలు, చాప్టరైజేషన్‌ను ఆన్‌లైన్‌లో పొందుపరిచే అంశంపై సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు అవగాహన కల్పించారు. సమావేశంలో సమగ్రశిక్ష ఏఎంఓ హరికృష్ణ, జీసీడీఓ శాంతాబాయి, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు మాధవరెడ్డి, తిప్పేస్వామి, ఏఎస్ఓ గురుమునికృష్ణ, రవికుమార్, నారాయణస్వామి, చంద్రమోహన్‌రెడ్డి, ఏఎస్ఓ ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

అక్రిడిటేషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

- మే 10వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా స్వీకరణ

అనంతపురం అర్బన్: నూతన అక్రిడిటేషన్లకు మే 10వ తేదీలోపు అర్హులైన జర్నలిస్టులు దరఖాస్తు సమర్పించాలని కలెక్టర్/జిల్లా మీడియా కమిటీ చైర్మన్ ఎం.గౌతమి సూచించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్, న్యూస్ ఏజెన్సీ జర్నలిస్టులు తమ దరఖాస్తులను www.ipr.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా అందజేయాలి. అర్హులైన వారికి రెండేళ్ల కాల పరిమితి గల అక్రిడిటేషన్లను మంజూరు చేస్తారు. ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసిన దరఖాస్తుకు సంబంధించి ప్రింట్ కాపీ, జతపరిచిన డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తును జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ (డీఐపీఆర్వో) కార్యాలయంలో సమర్పించాలి. పూర్తి వివరాలకు www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

యువకుడి బలవన్మరణం



మురళీకృష్ణ (ఫైల్)

గుత్తి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం చందన గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు మురళీకృష్ణ (23) డిగ్రీ వరకు చదువుకుని బీబీఎం పూర్తి చేశాడు. ఈ క్రమంలో ఉద్యోగం కోసం పలు ప్రయత్నాలు చేశాడు. కోరుకున్న ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని రెండు రోజుల క్రితం ఇల్లు వదిలిపోయాడు. శుక్రవారం అర్ధరాత్రి గుత్తి జీఆర్పీ పరిధిలోని జక్కల చెరువు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఎస్ ట్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని చిక్కవడియార్ చెరువులో ఉన్న సత్యసాయి సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్) ట్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న యువకుడిగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎడమచేతిపై చంద్ర అనే నల్లటి పచ్చబొట్టు ఉంది. ప్యాంట్, బనియన్ ధరించాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. సంబంధీకులు ఎవరైనా ఉంటే శింగనమల సీఐ (93460 10558), ఎస్ఐ (93929 18291)కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ అవర్స్

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 1వ తేదీ నుంచి ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ



విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం కోర్టురోడ్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టీఎస్ ఒలంపియాడ్ రెండో లెవెల్‌లో ప్రతిభ చాటారు. గోల్డ్ మెడల్స్ 117, మెరిట్ సర్టిఫికెట్స్ 196, కన్సొలేషన్ 33, స్పెషల్ ప్రైజ్ ఫస్ట్ ప్రైజ్ ఒకరు సాధించారు. విద్యార్థులను శనివారం పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ తబుస్సుమ్, డీన్లు రీషి, బాల అప్పలనాయుడు, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏఓ గోపాల్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అనురాధ

ఆత్మకూరు: మండలంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ అనురాధ తెలిపారు. శనివారం పి.యాలేరు, సిద్దరాంపురం గ్రామాల వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ కూలీలు పనులకోసం ఫీల్డ్ అసిస్టెంట్లను అడగాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి ఏపీడీ తెలిపారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

అనంతపురం కల్చరల్: సపారె చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి ఏడు గంటల వరకు స్థానిక లిటిల్‌ఫ్లవర్ పాఠశాల కళాప్రాంగణంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

సోమనాథ్ భరద్వాజ్‌కు 'యువకళారత్న పురస్కారం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన కళాకారుడు సోమనాథ్ భరద్వాజ్ యువకళారత్న పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులో ఈనెల 23 నుంచి 29 వరకు కూచిపూడి నృత్యోత్సవాలు జరిగాయి. సాయి మంజీరా కూడిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ కళాకారులతో ప్రదర్శనలు ఇప్పించారు. శనివారం జరిగిన ముగింపు ఉత్సవంలో ప్రసిద్ధ నాట్యాచార్యులు కేవీ సుబ్రమణ్యం, ఆంధ్రనాట్యం గురువులు కళాకృష్ణ తదితరుల చేతుల మీదుగా సోమనాథ్‌కు పురస్కారం అందించి, సత్కరించారు.

గుడిసెల తొలగింపు



గుడిసెలను తొలగిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సాములదొడ్డి పొలం 112/3సీ సర్వే నంబరులోని 2.86 ఎకరాల భూమిలో అక్రమంగా వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు శనివారం తొలిగించారు. ఈ భూమి కోర్టులో ఉన్న నేపథ్యంలో తహశీల్దార్ శ్రీధరమూర్తి, ఆర్ఐ విష్ణు, వీఆర్ఓ రఘు దగ్గరుండి గుడిసెలను తొలిగించేలా చర్యలు తీసుకున్నారు. ఇక్కడ గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఆశ చూపించి కొందరు డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. సోములదొడ్డి పొలం 97-1బీ సర్వే నంబరులో రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ శ్రీధరమూర్తి ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా నృత్యదినోత్సవం



కత్తి విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక లలితకళాపరిషత్తులో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరిపారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు డాన్స్ అండ్ డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన్నూరు, కత్తి విజయ్‌కుమార్, హరిప్రసాద్, రవికుమార్ మాస్టర్ల శిష్యబృందాలు సినిమా, జానపద నృత్యాలతో సందడి చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కళాకారులు ఎంతో ప్రతిభావంతులని, వారిని ప్రోత్సహించడానికి అందరూ ముందుండాలన్నారు. అనంతరం ఎల్కేపీ కార్యదర్శి పద్మజను సన్మానించారు.





రైలు బండి వచ్చింది.. బోగీ తెలియక గుబులైంది!

నిత్య జీవితంలో ప్రయాణమంటే ఉరుకుల పరుగులే అయ్యింది. రోజువారీ దినచర్యలో భాగంగా ఏదో ఒక పనిమీద నగరాలు, దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి ఉంటుంది. రైలు ప్రయాణమంటే ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు. అయితే అనంతపురం రైల్వే స్టేషన్‌లోని రెండు, మూడు ప్లాట్‌ఫారాల్లో రైలు బోగీ నంబర్లు చూపించే బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో రైలు వచ్చి స్టేషన్‌లో ఆగిందంటే .. ఏ బోగీ ఎక్కాలో ప్రయాణికులు తికమకపడుతున్నారు. నంబర్లు తెలియక ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు రైలు కదులుతుందని.. మరోవైపు బోగీ నంబర్ తెలియక గందరగోళానికి గురవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అన్నన్నా జోరుగెళ్లొద్దు.. జారిపడతామ్!

ప్రయాణం ప్రతి ఒక్కరికీ నిత్య అవసరమైంది. ఏ చిన్న పని అయినా బైక్ బయటకు తీయాల్సిందే. డీజిల్ ధరలు మండుతున్నా.. బైక్‌పై ప్రయాణమంటే కొందరికి భలే మోజు. ఒకరు లేదా ఇద్దరు సామర్థ్యంతో వెళ్తే ప్రయాణం సురక్షితం. పరిమితికి మించి ముగ్గురు, నలుగురు ప్రయాణిస్తే ప్రమాదాలు కొనితెచ్చుకోవాల్సిందే.. నగరంలో బైక్‌పై ఇలా నలుగురు ప్రమాదకరంగా ప్రయాణిస్తుంటే అందరి చూపూ వారిపైనే పడింది..

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

- ఎమ్మెల్యే 'అనంత'తో ఓ లబ్ధిదారురాలు
- 40వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: 'నలుగురు సంతానంలో ముగ్గురు పిల్లలు మూగవారు. గతంలో ఒకరికి మాత్రమే పింఛన్ వచ్చేది.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముగ్గురికీ పింఛన్ అందుతోంది.. ఒకరికి అమ్మఒడి వర్తించింది.. పిల్లలందరినీ ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాం.. వారి భవిష్యత్తుకు ఢోకా లేదు.. ప్రభుత్వం చేసిన మేలుకు రుణపడి ఉంటాం' అని ఆజాద్‌నగర్‌కు చెందిన హసీనా అనే వివాహిత ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో తన ఆనందాన్ని పంచుకుంది. ఇలా ప్రతి ఇంటి సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం 40వ డివిజన్‌లోని ఆజాద్‌నగర్‌లో ఎమ్మెల్యే 'అనంత' గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రభుత్వం చేసిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. కుమారి అనే మహిళ కుటుంబీకులకు తక్షణ బీమా సాయం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

- 40వ డివిజన్‌లో ఆజాద్‌నగర్‌లో ఆదివారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.



40వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ప్రజామద్దతు పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజల నుంచి సీఎం జగన్‌ను వేరుచేయలేరని, పీపుల్స్ మెగా సర్వేలో భాగంగా నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో అదే నిజమైందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజల్లో విశ్వాసం, సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సంక్షేమంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసం వద్ద జేసీఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, చింతా సోమశేఖర్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, చింతకుంట మధు, కార్పొరేటర్లు, తదితరులు పలు డివిజన్లకు సంబంధించిన ప్రజా మద్దతు పుస్తకాలను ఎమ్మెల్యేకు అందించారు. అనంతపురం నియోజకవర్గంలోని 85,865 కుటుంబాలను నేరుగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సమష్టిగా దిగ్విజయం చేసిన జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే మెచ్చుకున్నారు.

ఇంత ధైర్యం ఏ ప్రభుత్వం చేసింది?

అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేసినా, ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని అన్నారు. కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమైందన్నారు. ఈ నెల 7 నుంచి 29 వరకు నియోజకవర్గంలోని 50 డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో నిర్వహించిన మెగా పీపుల్ సర్వేకు అపూర్వ స్పందన లభించిందన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రజలను నయవంచన చేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అందుతున్న సంక్షేమం, అభివృద్ధితో ప్రజలు జగనే మా నమ్మకమంటూ ఇళ్లకు స్టిక్కర్లు అతికించుకొని ప్రజా మద్దతు తెలుపుతున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.800 కోట్లతో అభివృద్ధి జరుగుతోందని, ఇటీవల సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. తమ ప్రభుత్వంలో 25వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



రాప్తాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు

రాప్తాడు: ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ హౌసింగ్ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇక్కడ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి? ఎంత మందికి పట్టాలు ఇచ్చారు. ఎంత మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు అని హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు మండలాల్లో దాదాపుగా 30 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసి ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో సేవలందిస్తేనే ప్రత్యేక గుర్తింపు



డాక్టర్ నవీద్ అహమ్మద్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: బాధ్యతతో సేవలు అందిస్తేనే గుర్తింపు ఉంటుందని ఈఎన్‌టీ వైద్య విభాగాధిపతి డాక్టర్ నవీద్ అహమ్మద్ స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో పదవీ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీద్ అహ్మద్ సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి బాధ్యతయుతమైనదన్నారు. బాధ్యతతో రోగులకు వైద్యాన్ని అందించడం ద్వారా వారిలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, సమాచార శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మహబూబ్ బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, రచయిత తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, డాక్టర్ ఇలియాస్, డాక్టర్ అన్వర్, డాక్టర్ నవాజ్‌ఖాన్, వైద్యులు పాల్గొన్నారు.

సేవలే చిరస్మరణీయం



ప్రొఫెసర్ ఎస్వీ పుల్లారెడ్డి దంపతుల్ని సన్మానిస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: ఉద్యోగులకు విరమణ తప్పనిసరి, అయితే విధి నిర్వహణలో చేసిన సేవలే చిరస్మరణీయంగా నిలిచిపోతాయని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎస్కేయూ న్యాయ శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎస్వీ పుల్లా రెడ్డి పదవీ విరమణ చేశారు. న్యాయ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ ఎస్వీ పుల్లా రెడ్డి తనదైన ముద్ర వేశారన్నారు. ఎంతో మంది నిష్ణాతులైన ప్రొఫెసర్లు పనిచేసి వర్సిటీ న్యాయశాస్త్ర విభాగానికి వన్నె తెచ్చారని, ఇందులో పుల్లా రెడ్డి ఒకరని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఆర్ట్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం, ఆర్ట్స్‌అండ్ సైన్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. కృష్ణకుమారి, న్యాయశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్రీరాములు పాల్గొన్నారు.



రోడ్డంతా వర్షపునీటితో నిండినా.. సప్తగిరి సర్కిల్‌లో అరుగుపై నిద్రిస్తున్న ఓ వృద్ధుడు



నగరంలో జోరువాన కురుస్తున్నా.. స్కూటీపై వెళ్తున్న నగర మేయర్ వసీం

అనంతలో జోరు వాన..

వేసవిలో అకాల వర్షం కురుస్తోంది. జిల్లా వ్యాప్తంగా రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సాయంత్రం వరకు మండే ఎండ.. ఆ తర్వాత వాతావరనం చల్లబడి, చల్లని గాలితో పాటు జోరువాన కురుస్తోంది. శనివారంరాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో అనంత నగరం తడిసిపోయింది. సప్తగిరి సర్కిల్, రుద్రంపేట, తపోవనం తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ నీటితో నిండాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



మాట్లాడుతున్న రామాంజనేయులు

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల ఇన్‌చార్జులు బోయ రామాంజనేయులు, మఠం శ్యామ్ సుందర్ అన్నారు. శనివారం రాప్తాడులో స్థానిక ఎంపీపీ చాంబర్‌లో రాప్తాడు, అనంతపురం రూరల మండల వైఎస్సార్ సీపీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 7 నుంచి ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమానికి ఆదరణ లభించిందన్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో రాప్తాడు నియోజకవర్గంలోని 6 మండలాల్లో 1000 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు 64 వేల ఇళ్లను సందర్శించినట్లు తెలిపారు. ఎక్కడా తమను వ్యతిరేకించిన దాఖలాలు లేవన్నారు. ప్రతి ఇంటా జగనన్నకు మేము మద్దతు ఇస్తాం.. మా నమ్మకం తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అని చెప్పన్నారన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి కలిగిందని, మరో 30 ఏళ్ల ఆయనకు తిరుగులేదన్నారు. నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు తిరిగామో అందుకు సంబంధించిన ప్రజా మద్దతు పుస్తకాలు మీడియాకు చూపినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు ఎవరికి ఫోన్ చేసినా, ఎవరు వచ్చినా ప్రజా మద్దతు పుస్తకాలు ఇస్తామన్నారు. అనుమానం ఉంటే ఏ ఇంటికైనా ఫోన్ చేసి విచారించాలని, తాము ఏమి చెప్పామో.. ప్రజలు అదే చెప్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెలు, మేకలు ఫెడరేషన్ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, రాప్తాడు, అనంతపురం రూరల్, రామగిరి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు జూటూరు శేఖర్, బండి పవన్ కుమార్, గోవింద్ రెడ్డి, కుంటిమద్ది రమేష్, నాయకులు మనోహర్, కొండా రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, అభి, సింగారప్ప, మన్నల రవికుమార్, జయన్న, గుర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

నేడు 'చిగిచెర్ల' పుస్తకాల పరిచయ సభ

అనంతపురం కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి రచించిన పుస్తకాల పరిచయ సభ ఆదివారం జరగనుందని అరసం కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీవో హోంలో జరిగే కార్యక్రమంలో ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, మాజీ వీసీ వెంకట్రామిరెడ్డి, ఎస్కేయూ మాజీ వీసీ కాడా రామకృష్ణారెడ్డి, ప్రముఖ రచయితలు, కవులు హాజరవుతారన్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగుల స్థానాల మార్పు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ ఉద్యోగుల సీట్లు మారుస్తూ కమిషనర్ రమణారెడ్డి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఉత్తర్వులను జారీ చేశారు. బీ1 అసిస్టెంట్‌గా ఉన్న సునీల్‌ను ఈ ఆఫీస్, స్పందనకు, సీ2 అసిస్టెంట్‌గా ఉన్న జే సుగుణను బీ1 అసిస్టెంట్‌గా, సీ4, డీ4గా ఉన్న ఎం.దామోదర్‌ను ఎస్ఎంసీజీహెచ్ స్కూల్‌కు, హెచ్1 అసిస్టెంట్‌గా ఉన్న బీ పెద్దక్కను సీ2 అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వడ్డీ కట్టించుకొని రుణాలు రెన్యూవల్ చేయాలి

ఆత్మకూరు: రైతులతో వడ్డీ మాత్రమే కట్టించుకొని రుణాలు రెన్యూవల్ చేయాలని సీపీఎం నాయకులు స్థానిక కెనెరా బ్యాంక్ మేనేజర్‌ను కోరారు. శనివారం సీపీఎం నాయకులు స్కేల్ ఆఫ్ ఫైనాల్స్ ప్రకారం పంట రుణాలు పెంచి రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మండల కార్యదర్శి శివశంకర్, రామయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు పరిధిలోనే జామియా ఆస్తులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని జామియా మసీదు ఆస్తులు వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉంటాయని వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్ షేక్ షిరీన్ బేగం వాటికి సంబంధించి ఉత్తర్వులను జారీ చేశారన్నారు. జిల్లా కేంద్రంలోని జామియా మసీదుకు సంబంధించి ముతవల్లిలను కొనసాగిస్తూ హైకోర్టు ఉత్తర్వులను అందించిందని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారనే విషయంలో వాస్తవం లేదన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి

అనంతపురం అర్బన్: క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను చట్టపరంగా శిక్షించాలని మహిళా సమాఖ్య నాయకురాళ్లు స్థానిక రాజమ్మ కాలనీలో శనివారం నిరసన తెలిపారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి మాట్లాడారు. క్రీడాకారులకు అత్యున్నత గౌరవం ఇవ్వాలన్నారు. నాయకురాళ్లు జానకి, కుర్షిదా, యశోదమ్మ, లక్ష్మి, సులోచన, వసంత, బేగం, రేణుక, చాందిని పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థి ఎంపిక

రాప్తాడు: మోడల్ స్కూల్ 8వ తరగతి విద్యార్థి కే సాయి కుమార్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ పద్మజా దేవి, పీడీ బాలగొండ మల్లికార్జున తెలిపారు. శనివారం అనంత ఆర్డీటీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి, మే 26 నుంచి 28 వరకు జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ఆత్మకూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని మండల సచివాలయాల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా గ్రామాల్లో జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు అందాయా ? లేదా అని నేరుగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'

రాప్తాడు: అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా నమ్మకం అని ప్రజలు అంటున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నారెడ్డి, మాజీ సర్పంచు సాకే వెంకటేష్ అన్నారు. మరూరులో 'జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్లు సాకే హరికృష్ణ, కరుణకర్, అనురాధ, పరుశురామ్, నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కిడ్స్ జూబిలేషన్ సంబరాలు



చిన్నారులతో మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి

రాప్తాడురూరల్: నగరంలోని సంగమేషనగర్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి విద్యా సంస్థల్లో కిడ్జ్ జూబిలేషన్ సంబరాలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యా సంస్థల అధినేత సి.సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. చిన్నారులు ప్రత్యేకంగా స్నాతకోత్సవ డ్రస్సులు ధరించి అలరించారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను పాఠశాలల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు కె.పద్మావతి, ఎ.రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళల ఆర్థిక పురోగతే లక్ష్యం



మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: మహిళల ఆర్థిక పురోగతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ ముందు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలతో కలిసి ప్రారంభించారు. అర్బన్ మార్కెట్‌లో స్వయం సహాయక సభ్యులు స్టాళ్లలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను మేయర్ పరిశీలించారు. శానిటరీ న్యాప్‌కిన్స్, పినాయిల్, చేనేత వస్త్రాలు, పేపర్ ప్లేట్, ఇలా 28 రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. డిప్యూటీ మేయర్లు కోగటం , వాసంతి మాట్లాడారు. కార్యక్రమంలో మెప్మా పీడీ విజయలక్ష్మి, టీపీఆర్ఓ విశ్వజ్యోతి, టీఎంసీ శ్రీనివాసరెడ్డి, సీఓలు సత్యమూర్తి,, భువనేశ్వరి, వేణుగోపాల్, దూద్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీమాత జయంతి

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత, వాసవీమాత జయంత్యుత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని పాతూరు అమ్మవారి శాల అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు తెలిపారు. భారీ ఊరేగింపు, వాసవీ హోమం, అలంకార, అభిషేకాలు జరుగుతాయన్నారు.